# బాలభూమి

## వ్యాపారాభివృద్ధి

అవంతీపురంలో రాజరంగడు, మాణిక్యుడు అనే ఇద్దరు పూల వర్తకులు ఉండేవారు. రాజరంగడికి పూలంటే ప్రాణం. వీటిలోని మేలిమి పూలని జాగ్రత్తగా ఏరి అందంగా, కంటికింపుగా, ఆకర్షణీయంగా కనిపించేలా దండకూర్చేవాడు. అంతేకాక వాటిని చెమ్కీలతో, సువాసన ద్రవ్యాలతో చక్కగా అలంకరించేవాడు. అందుచేత అతడి పూలదండలని సొంతం చేసుకోవాలని కొనుగోలుదార్లు ఉత్సాహపడేవారు.

మాణిక్యుడు అలా కాదు. కేవలం వ్యాపార దృక్పథం అతనిది. కుంటివి, గుడ్డివి అయినాసరే ఆ పూలతో ఎలాగోలా దండ తయారుచేసి కొట్లో వేళాడదీసేవాడు. అవసరార్థం తప్పనిసరి అనుకునేవాళ్ళు అవి కొనుక్కుని వెళ్ళేవాళ్ళు. అయితే రాజరంగడి దండలకున్న గిరాకీని చూసి మనసులో ఈర్ష్యపడుతుంటేవాడు. అభివృద్ధిని చూసి బాధపడుతుండేవాడు.



ఒకసారి ఇద్దరూ పూలసేకరణకి కొద్దిదూరంలో వున్న అడవికి వెళ్ళారు. అలా అలా పూలు సేకరిస్తూ అడవి మధ్యలోకి చేరుకున్నాక వాళ్ళకో అరుదైన దృశ్యం కనిపించింది. వింత వింత సోయగాలతో, రకరకాల రంగుల రేకలతో, సువాసన లీనుతున్న ఆరచేయి మందాన వికసించిన నాలుగు పుష్పాలున్న పూలమొక్కొకటి కనిపించింది. అలాంటిది ఇంతకుముందు వాళ్ళు చూడలేదు. కనుచూపుమేరలో లేదు. వెంటనే మాణిక్యుడు-

"ఆ పూలని మొదట నేనే చూసాను. అందుచేత ఆ నాలుగు పూవులు నావే" అన్నాడు, మొక్క దగ్గరకెళ్ళి ఆ పూలని ఆత్రంగా కోసుకుంటూ.



రాజరంగడు 'అలాగే' అన్నట్టుగా నవ్వి, మాణిక్యుడు పూలుకోసుకున్నాక ఆ మొక్కని జాగ్రత్తగా మట్టితో సహా పెకళించి ఒక గుడ్డలో చుట్టుకుని నీళ్ళతో తడిపాడు. అది చూసి మాణిక్యుడు వెటకారంగా నవ్వుతూ-

"నువ్వెంత పిచ్చివాడివి రాజరంగా! నన్నడిగితే ఒక పువ్వు ఇచ్చేవాడిని కదా, అనవసరంగా ఆ మొక్కని పీకి చేతులు మట్టి చేసుకున్నావు. మీ ఇంటికెళ్ళి నాటితే అది ఎలాగూ బతకదు. వృథా ప్రయాస నీది. నేనీ పూలని అతి ఎక్కువ ఖరీదుకి అమ్మి లాభం కళ్ళ చూస్తాను. పాపం నువ్వు" అన్నాడు.

**యం.ప్రజ్ఞాన్**
**తల్లిదండ్రులు: శిరిష, భార్గవ**
**(హ్యూస్టన్, యు.ఎస్)**

రాజరంగడు సమాధానంగా సౌమ్యంగా నవ్వాడు.

కొంతకాలానికి రాజరంగడు వ్యాపారంలో చాలా అభివృద్ధి సాధించాడు. అది ఆ నోటా ఈ నోటా విని, తనకు బయటకెళ్ళడానికి అసలు తీరికలేనట్టు నటిస్తున్న మాణిక్యుడు, అదేంటో చూద్దామని రాజరంగడి కొట్టుకి బయల్దేరాడు.

కొట్టు చాలా విస్తరించింది. రాజరంగడు క్షణం తీరిక లేకుండా కనిపించాడు. ఇంకా విశేషం ఏమిటంటే తాము ఆ రోజు అడవిలో చూసిన పూలు, దండలుగా కొట్లో వేలాడదీసి ఉన్నాయి. కొట్టు కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. అన్ని పూలు రాజరంగడు ఎలా సంపాదించాడో అయోమయంగా వుంది మాణిక్యుడికి. అదే విషయం రాజరంగడిని అడిగాడు. అప్పుడు రాజరంగడు-

"వ్యాపారికి తొందర పనికి రాదు. నువ్వు కంటపడిన నాలుగు పూలతో తాత్కాలిక వ్యాపార ప్రయోజనం సాదిద్దామనుకున్నావు. నేను నిదానంగా భవిష్యత్తు గురించి ఆలోచించాను. నేను ఆ రోజు మొక్కని తీసుకుంటుంటే వ్యర్థప్రయత్నం అన్నావు. దాన్ని నేను మా పెరట్లో చక్కగా నాటి చంటిపిల్లలా చూసుకున్నాను. అదే నన్ను ఈ రోజు అభివృద్ధిపథంలో నడిపిస్తోంది. ఆ పూల మొక్క భగవంతుడు నాకిచ్చిన వరం" అన్నాడు.

మాణిక్యుడి ముఖం మాడిపోయింది. 'ఇక నుండి వ్యాపారంపట్ల రాజరంగడిలా శ్రద్ధ వహించాలి. ఈర్ష్యా, అసూయలకి తావీయకూడదు' అని మనసులో అనుకుంటూ ఇంటివైపు కదిలాడు.

**-ప్రతాప వెంకట సుబ్బారాయుడు**

(సికింద్రాబాదు)